జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, ఆగస్టు 19: జిల్లాలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కాగజ్‌నగర్ మండలం జంబుగలో 35.3, వాంకిడిలో 34.3, కెరమెరిలో 32.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దహెగాం మండలంలో పిడుగుపాటుకు అంజన్న అనే రైతుకు చెందిన ఎద్దు మృతిచెందగా, పెంచికలపేట మండలంలో బాపు అనే రైతుకు చెందిన మేక మృతి చెందింది. జిల్లాలో కురుస్తున్న వర్షంతో పాటు కుమరం భీం ప్రాజెక్టు, వట్టివాగు ప్రాజెక్టుల్లోకి వరదనీరు వచ్చి చేరుతుండ డంతో గేట్లు ఎత్తి నీటిని కిందికి కిందికి వదులుతున్నారు.

సామూహిక యజ్ఞోపవీతధారణ



యజ్ఞోపవీతాన్ని స్వీకరిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 19: శ్రావణ జంధ్యాల పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం జిల్లాకేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తులు సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిదులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఏకాదశ దీక్షలు



మాలధారణ స్వీకరిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్ రూరల్,ఆగస్టు 19: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో వంద మంది హనుమాన్ భక్తులు ఏకాదశదీక్షలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు దీక్షాసమయంలో పాటించాల్సిన నియమనిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధులు వివేక్, శ్రీనివాస్, మధు, తేజ, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎస్సై నరేష్

చింతలమానేపల్లి, ఆగస్టు 19: మండలంలోని రవీంద్రనగర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యంను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. బూరెపల్లి గ్రామానికిచెందిన నక్క రవి, పెరుగు తిరుపతి అనే ఇద్దరువ్యక్తులు రెండు ద్విచక్రవాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 4క్వింటాళ్ల రేషన్‌బియ్యం బాబాపూర్ వద్ద పట్టున్నామన్నారు. అలాగే బాలాజీఅనుకోడ గ్రామానికిచెందిన రౌతు శంకర్ అనే వ్యక్తి బొలేరో వాహనంలో అక్రమంగా తర లిస్తున్న 23క్వింటాళ్ల రేషన్ బియ్యంను రవీంద్రనగర్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం 27క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకొని రెండు ద్విచక్ర వాహనాలను, ఒకబొలేరో వాహనం సీజ్‌చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మండల ఒడ్డెర కమిటీ

రెబ్బెన, ఆగస్టు 19: మండల ఒడ్డెర కమిటీ సోమవారం ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడిగా బోదాసు వెంకన్న, అధ్యక్షుడు రాపాక వెంకటేష, ఉపాధ్యక్షుడిగా తులసీరాం, మహిళా మండల అధ్యక్షురాలిగా దేవర్ల స్వరూప, ఉపాధ్యక్షురాలుగా సమ్మక్కను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఒడ్డెరకులస్థులు వెంకటస్వామి, సమ్మయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈపాటికే సర్పంచ్ ఎన్నికలు ముగిసి సర్పంచ్‌లు పాతబడేవారు. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆశావహులు ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఇంకా ఎన్నికలకు నెలలు పట్టే అవకాశం ఉండటంతో అప్పటిదాకా ప్రజల్లో ఉంటూ మద్దతు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.

\- బెజ్జూరు

- కొన్నిచోట్ల తాజా మాజీసర్పంచ్‌లు
- మరికొన్నిచోట్ల అధికారపార్టీ శ్రేణులు
- ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న నాయకులు
- రిజర్వేషన్లపై అంతర్మథనం

గ్రామాల్లో ఎన్నికల సందడి



జిల్లాలో 375 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి ఈ ఏడాది జనవరి 31తో గడువు ముగియడంతో ఆరునెలలు ప్రత్యేక పాలన విధించారు. ఈ సమయం కూడా జూలైతో ముగియగా పొడిగింపు అనివార్యమైంది. ఆరునెలలు గడిచినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఎన్నికల కోసం ఎదురుచూసిన గ్రామ నాయకులు ప్రభుత్వ కార్యక్రమాల్లో హల్‌చల్ చేస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం మొదలు పెట్టారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా తాము పోటీలో ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజల్లో పేరున్న తాజామాజీలు మళ్లీ ప్రజల మధ్య ఉంటుండగా, మరికొన్నిచోట్ల అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వం తనమదేనని తాముంటేనే పనులు అవుతాయని ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో నలుగురు, ఐదుగురు ఆశావహులు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి చెందిన సర్పంచ్‌లే 90 శాతం నెగ్గారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారం లో ఉండటంతో ఈ సారి తమను ఆదరిస్తారని కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో ఆశావహుల సందడి నెలకొంది.

ఆరు నెలలుగా ప్రత్యేక పాలన..

దాదాపు ఏడాదిగా పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. వానాకాలం సీజనల్ రోగాలు ప్రబలకుండా కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పంచాయతీల్లో నిధులు కరువయ్యాయి. కొత్తగా ఏర్పాటైన గిరిజన పంచాయతీల్లో అప్పట్లో ట్రాక్టర్ల రుణాల ఈఎంఐలు చెల్లించడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ప్రభుత్వం ప్రకటించినా ఇంకా అనేక పంచాయతీ ఖాతాల్లో జమకాలేదని మాజీసర్పంచ్‌లు వాపోతున్నారు. మరోవైపు ప్రజలకు ప్రత్యేకాధికారులు అందుబాటులో లేకపోవడం మూలంగా పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతం నియమితులైన ప్రత్యేకాధికారులు తమశాఖల పనులకే పరిమితమవుతూ సభలు, సమావేశాలకు మాత్రం హాజరవుతున్నారని ఆరోపనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంచాయతీఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

పల్లెల్లో ఎన్నికల సందడి..

జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో గ్రామ పంచాయతీల ఎన్నికల సందడి నెలకొంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో అందరిచూపు సర్పంచ్ ఎన్నికలపై పడింది. ఇప్పటి వరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకోసం పనిచేసిన గ్రామస్థాయి నేతలు చాలామంది ఈసారి సర్పంచ్ లేదా, ఎంపీటీసీగా పోటీ చేయాలన్న ఉత్సాహంతో ఉన్నారు. ఓటర్లకు దగ్గరయ్యేందుకు వివిధ కార్యక్రమాలను చేస్తున్నారు. పండుగలు, వివిధ ముఖ్యమైన రోజుల్లో గ్రామాల్లోనే ఉంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

దీంతో గ్రామాల్లో ఇప్పటినుంచే ఎన్నికల సందడి మొదలైనట్లుగా కనిపిస్తోంది. జనాలు ఎక్కడ కలిసినా బాగున్నావా అంటూ పలకరింపులు మొదలు పెడుతున్నారు. ఎలాగైనా ఈసారి సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని ఓటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో అధికారులు ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితాను రూపకల్పన చేస్తున్నారు. ఎన్నికల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లంతా ఒకే దగ్గరకు చేర్పించే పనిలో ఉన్నారు.

పాత రిజర్వేషన్లేనా

గత ప్రభుత్వం పంచాయతీల్లో రిజర్వేషన్ల గడువు పదిసంవత్సరాలు పెంచుతూ చట్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీకులగణన చేపట్టిన అనంతరం వాటి ఆధారంగా రిజర్వేషన్లలో మార్పులు తీసుకరావాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ ప్రక్రియ వ్యయ ప్రయాసలతో కూడుకొని ఉండటం, సమయాభావం కారణంగా పాతరిజర్వేషన్ల ఆధారంగానే ఎన్నికలు జరుగుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

వార్డు మ్యాపింగ్, ఓటరు జాబితాపై శిక్షణ..

సీఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. ఇందుకోసం వార్డుల మ్యాపింగ్, ఓటరు జాబితా తయారుపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ఎన్నికలు సజావుగా నిర్వ హించడానికి పోలింగ్‌కు కొన్ని నెలల ముందే ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనకు జిల్లా నుంచి డాటా ఎంట్రీ ఆపరేట ర్లను ఎంపిక చేసి శిక్షణ ఇప్పించారు. ముందుగా వార్డుల మ్యాపింగ్, వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. వీరు రూపొందించిన జాబితాను జిల్లా అధికారులు పరిశీలించి ఓటరు తుది జాబితాను వెల్లడిస్తారు.

సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌తో రాష్ట్ర పురపాలిక ముఖ్యకార్యదర్శి దాన కిశోర్

ఆసిఫాబాద్, ఆగస్టు 19: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాలు అర్హులైన ప్రతిలబ్ధిదారుడికి అందేవిధంగా అధికారయంత్రాంగం పనిచేయాలని రాష్ట్ర పురపాలికల ముఖ్యకార్యదర్శి దానకిశోర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ఇతర మున్సిపల్ ఉన్నతాదికారులతో కలసి అన్నిజిల్లాల అదనపు కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్లతో లేఅవుట్ క్రమబద్దీకరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, మహిళాశక్తి స్వచ్ఛదనం- పచ్చదనం, వీధి కుక్కల నియంత్రణ తదితర అంశాలపై సమీక్షసమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలికల ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ లే అవుట్ క్రమబద్దీకరణ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు అమలు చేయాలని, మహిళాఅభివృద్ధి దిశగా స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకంలో పొందుపరిచిన వ్యాపార అంశాలను దరఖాస్తు చేసుకున్న మహిళా సంఘాలకు అర్హత మేరకు కేటాయించి ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని వీసీహాల్ నుంచి అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేని లేఅవుట్ల ద్వారా కొనుగోలుచేసిన ఇంటిస్థలాల క్రమబద్దీకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా శక్తి పథకం ద్వారా ఔత్సాహిక మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికాభి వృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామ న్నారు. మున్సిపాలిటీలలో వీధి కుక్కల బెడదలేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ నిరంతరాయంగా చేపట్టేందుకు కార్యాచరణ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ మోతీలాల్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 19: ఆసిఫాబాద్ మండలంలోని కుమరంభీం ప్రాజెక్టు వట్టివాగు ప్రాజెక్టులోకి వరదఉధృతి కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆయాప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో కుమరంభీం ప్రాజెక్టు గేట్లను ఎత్తి వరదనీటిని కిందికి వదులుతున్నారు. కుమరంభీం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 243మీటర్లు కాగా 237.800 మీటర్లకు చేరుకుంది. 430క్యూసెక్కుల వరదనీటిని కిందికి వదులుతున్నారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 239.5మీటర్లకు గాను 238.400మీటర్లకు నీటిమట్టంచేరుకుంది. 850 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండడంతో రెండు గేట్లు ఎత్తి 1800క్యూసెక్కుల వరదనీటిని కిందికి వదులుతున్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం: జీఎం



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, ఆగస్టు 19: సింగరేణిలో ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధానలక్ష్యంగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషిచేయాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం ఎంవీటీసీలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు నిర్వహించిన ట్రక్కర్ శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90మందికి 12రోజులపాటు మూడుదఫాలుగా ఈశిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. సింగరేణిలో ప్రతిపనిపై అవగాహన పెంచడంతోపాటు చేపట్టాల్సిన లక్ష్యాలను తెలియజేస్తామన్నారు. ప్రమాదాలు లేని సంస్థగా ఇతరసంస్థలకు ఆదర్శంగా నిలపాలన్నారు. ఓవర్ మెన్‌లు, సివిల్ సూపర్‌వైజర్‌లు, అండర్‌మేనేజర్‌లు పనిస్థలాలను నిశితంగా పర్యవే క్షించాలని తెలిపారు. ప్రతిరోజు రక్షణ సూత్రాలు పాటించేలా కార్మికులకు తెలియజేయాలన్నారు. చిన్నచిన్న పొరపాట్లే, కారణాలే ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. మందమర్రి ఏరియాలో ప్రమాదాల నివారణకు కృషిచేయాలని సూచించారు. శిక్షణతరగతుల్లో చెప్పిన అంశాలను రివ్యూ చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీజీఎం రఘుకుమార్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఎంవీటీసీ యాక్టింగ్‌మేనేజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని మందమర్రి ఏరియా జీఎం దేవేం దర్ పేర్కొన్నారు. సోమవారం కాసిపేట 2వ గనిని ఆయన సందర్శించి పని స్థలాలను పరిశీలించారు. అనంతరం సమావేశంలో జీఎం మాట్లాడుతూ కార్మికులందరి సమష్టి కృషివల్లనే ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించవచ్చన్నారు. ప్రతి కార్మికుడు రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలన్నారు. అనంతరం జీఎంను కార్మికులు ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, కేకే గ్రూపు ఏజెంటు రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



'నూతన బొగ్గు గనులను ప్రారంభించాలి'

కాసిపేట, ఆగస్టు 19: సింగరేణిలో నూతన బొగ్గుగనులను ప్రారంభించి సంస్థ మనుగడను కాపాడాలని ఏఐటీయూసీ అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. సోమవారం కాసిపేట 1వ గనిపై ఏర్పాటుచేసిన గేట్‌మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థలో భూగర్భ గనులు మూతపడడంతో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, దీంతో రానున్న 15సంవత్సరాల్లో బొగ్గు బావులు మూతపడి కార్మికులపరిస్థితి అగమ్య గోచరంగా మారనుందన్నారు. సింగరేణి యాజమాన్యం వెంటనే నూతన బొగ్గుబావులను ప్రారంభించి సంస్థమనుగడను కాపాడాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్, దాసరి తిరుపతి గౌడ్, పిట్‌కార్యదర్శి మీనుగులక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, రంజిత్ కుమార్, శ్రీహరి, రాజేందర్, సురేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మందమర్రి టౌన్, ఆగస్టు 19: బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి సోమవారం క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. పలువురు అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీఎం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతోపాటు కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య పాల్గొన్నారు.

'సీసీసీలో నీటి సరఫరా మెరుగుపర్చాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 19: సీసీసీలోని సింగరేణి క్వార్టర్లకు నీటిసరఫరా సక్రమంగా జరగడం లేదని హెచ్ఎంఎస్ ఏరియాఉపాధ్యక్షుడు తిప్పారపుసారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. కొన్నేళ్లక్రితం వేసిన పైపులకు రంధ్రాలుపడి నీరు వృథా అవుతోందన్నారు. దీనివల్ల క్వార్టర్లకు సరఫరా సక్రమంగా కావడం లేదన్నారు. సన్నటిధార వస్తుండడంతో పట్టుకోవడానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం అయినప్పటికీ ఎండాకాలం వలె నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మూడు, నాలుగు రోజులుగా పరిస్థితి మరీఅధ్వాన్నంగా ఉందన్నారు. సివిల్ విభాగం వారికి ఫిర్యాదు చేస్తున్నామని, వారు తాత్కాలిక మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండడం లేదని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి నూతన పైపులు వేయించి క్వార్టర్లకు నీటి సరఫరా మెరుగుపర్చాలని కోరారు.

మేనేజర్‌ను సన్మానించిన ఏఐటీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, ఆగస్టు 19: ఏరియాలోని కేకే5గని మేనేజర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌ను ఏరియా ఏఐటీయూసీ నాయకులు కలిసి పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంక్షేమానికిపాటుపడే అధికారులకు తమ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్రసత్యనారాయణ, గాండ్ల సంపత్, విక్రంసింగ్, పూదరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న అధికారికి సన్మానం

రెబ్బెన, ఆగస్టు 19: బెల్లంపల్లి ఏరియాలోని పని చేసి జీఎం(సీహెచ్‌పీఎస్)గా పదోన్నతిపై కార్పొరేట్‌కివెళ్లిన తిరుమల్‌రావును బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, మార్కెటింగ్ జీఎం రవిప్రసాద్, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజమల్లు, ప్రాజెక్టు అధికారి నరేందర్ ఉమాకాంత్, ఏరియా ఇంజనీర్ జాడే, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

ఎద్దుల బండిపై.. ఏడు నెలల గర్భిణి

- రెండు కిలో మీటర్లు ప్రయాణం
- పురిటిలోనే నవజాత శిశువు మృతి



చికిత్స పొందుతున్న గర్భిణి, (ఇన్‌సెట్లో) మృతిచెందిన శిశువు

పెంచికలపేట, ఆగస్టు 19: ఏడు నెలల గర్భిణీ.. రెండు కిలో మీటర్లు చెరువు కట్టపై గుంతలతో ఉన్న బురదమార్గం గుండా ప్రయాణించి.. పురిటిలోనే నవజాత శిశువును కోల్పోయింది. ఈ హృదయ విదారక ఘటన కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలోని మేరగూడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎన్ఎం లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం... మేరగూడ గ్రామానికిచెందిన దుర్గం పంచపూల అనే ఏడు నెలల గర్భిణికి సోమవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో నొప్పులతో రక్తస్రావం అయింది. దీంతో 108 వాహనాన్ని సంప్రదించారు. అయితే మేరగూడ రోడ్డు గుంతలతో బురదమయంగా ఉండడంతో చేసేదేమి లేక ఎద్దుల బండిలో అవస్థలు పడుతూ రెండున్నర కిలోమీటర్లు ప్రయాణించింది. అప్పటికే ఏల్లూరుకు చేరుకున్న 108వాహనంలో గర్భిణిని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. కానీ గర్భిణి పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు కాగజ్ నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం చికిత్స నిర్వహించి మృతిచెందిన శిశువు బయటికి తీశారు. గ్రామానికి ఇప్పటికీ వరకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని కుటుంసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, ఆగస్టు 19: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేస్తారని అదనపు కలెక్టర్ దాసరివేణు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వరరావు, సురేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన గంతిదాస్ తాను రవీంద్రనగర్ తెలంగాణ గ్రామీణబ్యాంకు నుంచి రుణం తీసుకున్నానని, రుణమాఫీ జాబితాలో తనపేరు రాలేదని, పరిశీలించి తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన సావిత్రి తన పేరిట గ్రామశివారులో పట్టాభూమి ఉందని, నూతన పట్టాపాసు పుస్తకంలో తక్కువ విస్తీర్ణం నమోదైందని, పొరపాటును సవరించి పూర్తి విస్తీర్ణంలో పట్టాపాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్‌వాడి, రహమత్ నగర్ వాసులు తమను 5వవార్డులో చేర్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలకేంద్రానికి చెందిన గణపతి తనఇంటిస్థలంలో కొంతభాగాన్ని ఇతరులు ఆక్రమించుకొని ఇల్లు నిర్మించు కున్నారని దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని దరకాస్తు అందజేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెంచికలపేట, ఆగస్టు 19: మండలంలోని ఎల్లూరు గ్రామంలో ఆదివారం పిడుగుపడి మృతిచెందిన సిడాం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీజేపీ నాయకుడు పాల్వాయి సుదాకర్‌రావు వేర్వేరుగా పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్నిరకాల సాయం అందజేస్తామని భరోసా కల్పించారు. వారివెంట నాయకులు మదుకర్, ప్రభాకర్, కృష్ణమూర్తి, రవీందర్, సత్తన్న, శ్రీకాంత్, శోభన్, సాయికిరణ్, వెంకన్న, సాయి, సంతోష్, బాపు, హనుమంతు, హన్మగౌడ్ ఉన్నారు.

నలుగురు డీజే నిర్వాహకులపై కేసు

తంగళ్లపల్లి, ఆగస్టు 19:తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో అనుమతి లేకుండా డీజేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లెల్లలో మూడు డీజేలు, మండల కేంద్రంలోని బాబాజీ కాలనీలో ఒక డిజే సీజ్ చేసి నలుగురు నిర్వాహకులు పోలాడి నవీన్, కోడం పృథ్వి, పంది సాయికుమార్, కోడం ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ దాడులలో ఏఎస్ఐ చంద్రమౌళి, కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అదుపు తప్పి పాల వ్యాన్ బోల్తా

-ఇద్దరు యువకులు మృతి, ఒకరి పరిస్థితి విషమం


మృతి చెందిన మల్లేష్, భద్ర (ఫైల్)

కాసిపేట, ఆగస్టు 19: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం కల్వరీ చర్చి సమీపంలో సోమవారం తెల్లవారు జామున పాలవ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ నవనందుల మల్లేష్ (22), మరో యువకుడు బైరినేని భద్ర(18) అక్కడికక్కడే మృతిచెందగా, బైరినేని శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్ డెయిరీ పాలప్యాకెట్లు సరఫరాచేసేవ్యాన్ సోమవారం తెల్లవారు జామున 2.30గంటలకు మందమర్రి మండలం అందుగులపేట నుంచి బెల్లంపల్లికి బయలుదేరింది. అందుగులపేటకు చెందిన డ్రైవర్ మల్లేష్ వాహనం నడుపుతుండగా ఊరు మందమర్రికి చెందిన హెల్పర్లు బైరినేని భద్ర, శంకర్‌లు పక్కన కూర్చున్నారు. మల్లేష్ వేగంగా అజాగ్రత్తగా నడపడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును, స్పీడ్ లిమిట్ బోర్డును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మల్లేష్‌తో పాటు బైరినేని భద్ర అక్కడికక్కడే మృతిచెందగా శంకర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు శంకర్‌ను బెల్లంపల్లి ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. సంఘటన స్థలాన్ని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పండగ పూట విషాదం

మందమర్రిరూరల్: రాఖీ పండగ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొం ది. మృతుడు మల్లేష్ తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మల్లేష్‌కు ఇంకా వివాహం కాలేదు. అలాగే భద్ర తండ్రి రాజేష్ గతంలోనే మృతిచెందగా తల్లి సునీత కూలీ చేస్తూ ఇద్దరు కుమారులను పోషిస్తుంది. అలాగే గాయాలపాలైన శంకర్ పగలు ఆటో నడుపుతూ రాత్రి పాలవ్యాన్‌పై పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శంకర్‌కు భార్య మహేశ్వరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్లంపల్లి చోరీ కేసును ఛేదించిన పోలీసులు

● వ్యాపారి కారు డ్రైవరే సూత్రధారి ● నలుగురి అరెస్టు


నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్ ఆగస్టు 19: బెల్లంపల్లిలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి కారు నుంచి రూ.28లక్షలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదిం చారు. వ్యాపారి వద్ద గతంలో డ్రైవర్‌గా పనిచేసిన పటాలవత్ దాస్ అనే వ్యక్తే ఈ చోరీకి పథకం వేసినట్టు పోలీసులు గుర్తించారు. అతనితో పాటు జోగు అలియాస్ పోతుల శివ, ముప్పురు రాజు, పండుగ రాజును సోమ వారం బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొ న్నారు. వీరి వద్ద నుంచి రూ.24లక్షల నగదు, రెండుబైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం రామగుండం కమిషరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ అరెస్టు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన బిపిన్ కుమార్ అనే వ్యాపారి వివిధ జిల్లాలకు సరుకులు ఇచ్చి ప్రతీనెలా కలెక్షన్‌కు వచ్చేవాడు. పెద్దఎత్తున నగదును తీసుకెళ్లేవాడు. అతని వద్ద హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన పటాలవత్ దాస్(26) అనే వ్యక్తి డ్రైవర్‌గా పని చేసేవాడు. డ్రైవర్‌గా పని చేసే సమయంలోనే కారుకు డూప్లికేట్ కీ తయారు చేయించుకున్నాడు. తరువాత పని మానేశాడు. బిపిన్‌కుమార్ కలెక్షన్‌కు వెళ్లిన సమయంలో అతనికారు నుంచి నగదు చోరీ చేసేందుకు ప్రణాళిక వేసుకున్నాడు. స్నేహి తులైన జోగు అలియాస్ పోటుల శివ(25), ముప్పురు రాజు(25), పండుగ రాజు(22)ను కలుపుకొని చోరీకి పథకం వేసుకున్నారు. ఈ నెల 16న బిపిన్ కుమార్ హైదరాబాద్ నుంచి కలెక్షన్‌కు మంచిర్యాలకు వెళుతున్నాడని తెలిసి రెండు బైక్‌ల్లో అతడిని అనుసరించారు. మంచిర్యాలలో అతడు బస చేసిన లాడ్జి సమీపంలో నిందితులు బస చేశారు. తెల్లవారి నలుగురు రెండు బైక్‌లపై వేరువేరుగా డబ్బులున్న కారును వెంబడించారు. ఈ నెల 17న బెల్లంపల్లి బజార్ మెయిన్ రోడ్డులోని సత్తన్న ఇడ్లి బండి వద్ద నిలిపి ఉంచి కారు నుంచి నకిలీ కీ ద్వారా డోర్ తెరిచి మాజీ డ్రైవర్ దాసు, అతని స్నేహితుడు శివలు హెల్మెట్లు, మాస్కులు ధరించి రూ.28లక్షలు ఎత్తుకెళ్లారు. తరువాత బెల్లంపల్లి సమీపంలోని అడవిలో తలదాచుకున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య నాలుగు టీములను ఏర్పాటు చేశారు. ఈ టీములు సీసీ ఫుటేజీలను పరిశీలించగా బైక్‌లపై వచ్చిన వ్యక్తులు నగదు గల బ్యాగును ఎత్తుకెళ్లినట్టు గురించారు. సోమవారం నిందితులు టిఫిన్ చేయడానికి బెల్లంపల్లికి వస్తుండగా ప్రభుత్వ కళాశాల వద్ద తనిఖీల్లో నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ దేవయ్య, కానిస్టేబుల్ మల్లేషం, మంచిర్యాల సీసీఎస్ కానిస్టేబుళ్ల సతీష్, శ్రీనివాస్‌లకు సీపీ రివార్డులు అందజేశారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

రెబ్బెన, ఆగస్టు 19: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని రెబ్బెనలోని ఎల్లమ్మదేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ గౌడ్, అనిల్ గౌడ్, కేసరి అంజనేయులు గౌడ్, అన్నపూర్ణ అరుణ మురళిగౌడ్, సర్వేశ్వర గౌడ్, కేసరి కిషన్‌గౌడ్, మోడం సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


పోస్నం వంశీకృష్ణ (ఫైల్)

దండేపల్లి, ఆగస్టు 19: దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన పోస్నం వంశీకృష్ణ(22) అనే యువకుడు సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వంశీకృష్ణ తల్లి సుజాత లక్షెట్టిపేట ఎస్సీ వసతి గృహంలో కామాటిగా పని చేస్తోంది. ఇటీవల మ్యాదరిపేటలో ఇంటి నిర్మా ణం చేపడుతున్నారు. నిర్మాణం విషయంలో మందమర్రికి చెందిన సిద్ధం అంజయ్యతో గొడవ జరిగి కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో సోమ వారం అంజయ్య హైకోర్టులో కేసు వేస్తానని బెదిరించాడని వంశీకృష్ణ తల్లితో ఫోన్ చేసి చెప్పాడు. మధ్యాహ్న సమయంలో ఆదే గ్రామానికి చెం దిన ఓ వ్యక్తి అటుగా వెళ్లగా వంశీకృష్ణ తలకు గాయంతోపాటు గొంతుకు కాలిన గాయమై మృతి చెంది ఉన్నాడని సుజాతకు ఫోన్ ద్వారా సమా చారం అందించాడు. కుమారుడి మృతిపై అనుమానం ఉందని విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామకృష్ణాపూర్, ఆగస్టు 19: బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసిఫాబాద్‌కు చెందిన మేకల చంద్రశేఖర్ మృతి చెందాడు. బంధువులతో కలిసి హైదరాబాద్‌లో వివాహానికి హాజరై ఆసిఫాబాద్‌కు కారులో తిరిగి వెళ్తుం డగా గాంధారి మైసమ్మ ఆలయ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. కారు నడుపుతున్న చంద్రశేఖర్ తలకు, ఛాతి భాగంలో గాయాలు కాగా కారులో ప్రయాణిస్తున్న స్నేహితులు చికిత్స నిమిత్తం మంచిర్యాలకు తర లించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

పిడుగుపాటుతో రైతు మృతి


భాస్కర్ గౌడ్ (ఫైల్)

భీమిని, ఆగస్టు 19: బిట్టూరుపల్లి గ్రామానికి చెందిన జక్కుల భాస్కర్‌గౌడ్ (56) సోమవారం పిడుగుపాటుతో మృతి చెందాడు. పొలానికి కాలువ మరమ్మతు పనులు చేస్తుండగా ఒక్కసారిగా వర్షం రావడంతో సెల్ ఫోన్ మాట్లాడుతూ పక్కకు వెళ్లాడు. దీంతో అతడిపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సువర్ణ, కుమారులు ప్రసాద్ గౌడ్, గణేష్ గౌడ్‌లు ఉన్నారు. కూతురు సంగీతకు వివాహం చేసాడు. చిన్న కుమారుడు గణేష్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

భార్యను కొట్టి చంపిన భర్త


విమల (ఫైల్)

దండేపల్లి,ఆగస్టు 19: దండేపల్లి మండలం కాసిపేట గ్రామానికి చెందిన ఆవుల విమల(26)ను ఆమె భర్త నరేష్ అనుమానంతో ఆదివారం హతమార్చాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాసిపేట చెందిన దుమ్మల్ల పోషం -సరిత దంపతుల కుమారై విమల అదే గ్రామానికి చెందిన ఆవుల నరేష్‌లు 2012లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. నరేష్ మద్యం తాగివచ్చి భార్యతో రోజూ గొడవ పడేవాడు. దీనితో పాటు వేరొకరితో ఆమెకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. పది రోజుల క్రితం అతిగా మద్యం తాగి వచ్చి భార్య విమలను తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె పుట్టింటి వారికి చెప్పగా నరేష్‌ను మందలించారు. ఆదివారం సాయంత్రం రాఖీ పండుగ సందర్భం గా పుట్టింటికి వస్తానని తల్లికి చెప్పింది. రాత్రయినా రాకపోవడంతో అదే ఊరిలో ఉన్న పుట్టింటి వారు విమల ఇంటికి వెళ్లారు. వారి రాకను గమనిం చిన నరేష్ తలుపులు తీసి వారిని నెట్టుకుని పరారయ్యాడు. అతని చేతిలో రక్తపు మరకలతో ఉన్న రాడ్ కనిపించడంతో అనుమానంతో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూసే సరికి విమల తలకు బలమైన గాయమై రక్తపు మడుగులో కనిపించింది. ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెంది నట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలుకు ఇద్దరు కుమారైలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

కెరమెరి, ఆగస్టు 19: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు రాజేందర్ అన్నారు. సోమవారం కేస్లాగూడ పంప్‌హౌజ్ వద్ద కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. నాలుగునెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. పండుగపూట పస్తులుండాల్సి వస్తోందన్నారు. వేతనాలు రాకపోతే ఈనెల 21నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్మికులు బుద్దయ్య, అంకుస్, సోను, చరణ్, తిరుపతి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

'హక్కుల సాధన కోసం కలిసికట్టుగా ఉద్యమిద్దాం'

జైనూర్, ఆగస్టు 19: హక్కుల సాధనకోసం కలిసికట్టుగా పోరాడుదామని ఆదివాసీసంఘాల నాయకులు అన్నారు. మండలంలోని మార్లావాయి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సార్మేడి మేస్రాం దుర్గుపటేల్ సారథ్యంలో రాయి సెంటర్ల సమావేశం ఆదివారం రాత్రిమండలంలోని మార్లావాయిలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని రాయిసెంటర్ల సార్మేడిలు హాజరై ఏకగ్రీంగా పలు తీర్మాణాలు చేశారు. కార్యక్రమంలో సార్మేడిలు జుగునాక దేవరావ్, ఆనంద్‌రావ్, మేస్రాం బాదిరావ్, మక్తుర్‌శావ్, సోయం గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జైనూర్, ఆగస్టు 19: మండలంలోని ఉషేగాం సమీపంలో సోమవారం ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో దానిపైనున్న కుంర బాదిరావ్(43) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో అతని ఎడమ చేయి విరిగి పోయిందని, కంటికి తీవ్రంగా దెబ్బతగిలిందని 108పైలట్ లటపటే ఉద్దవ్ తెలిపారు. బాదిరావ్‌ను ఉట్నూరు సివిల్ ఆసుపత్రికి తరలించామ న్నారు. కాగా బాదిరావ్ కొద్ది రోజులనుంచి సిర్పూర్(యు) మండలంలోని పుల్లారలో బంధువుల ఇంట్లో ఉంటూ నాలుగు రోజులకొకసారి ఉట్నూరు రాకపోకలు చేస్తూ డయాల సిస్ చేయించుకుంటున్నాడు. ఈక్రమంలో డయాలసిస్ కోసం జైనూరు నుంచి ఉట్నూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

వ్యవసాయాధికారులకు సన్మానం

● వాంకిడి వ్యవసాయాధికారిగా గోపికాంత్


గోపికాంత్

వాంకిడి, ఆగస్టు 19: వాంకిడి వ్యవసాయాధికారి మిలింధ్ కుమార్ బదిలీపై ఆసిఫాబాద్‌కు వెళ్లగా ఆయన స్థానంలో కెరమెరి ఏవో గోపికాంత్ రాగా వారిని సోమవారం ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫెర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్ కుమార్, శివకుమార్, లక్ష్మీనారాయణ, సాయి, గణేష్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎడ్లు మృతి


దహెగాంలో మృతిచెందిన ఎద్దు

దహెగాం, ఆగస్టు 19: మండలంలోని ఖర్జీ గ్రామానికి చెందిన ధనూరి అంజన్న ఎద్దు సోమవారం పిడుగుపాటుకు గురై మృతిచెందింది. మధ్యాహ్నం వ్యవసాయ పనులు చేస్తుండగా వర్షం రావడంతో ఇంటికి వెళ్లే క్రమంలో పిడుగు పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. కాగా అంజన్న స్పృహ కోల్పోగా స్వల్పంగా గాయాలు అయ్యాయి.

లింగాపూర్: మండలంలోని లొద్దిగూడా గ్రామపం చాయతీలోని పెద్దదంపూర్ గ్రామానికి చెందిన గేడం నవీన్ అనే రైతు ఎద్దు సోమవారం పిడుగు పడి మృతిచెందింది. నవీన్ రోజులాగే సోమవారం ఎడ్లను మేపడానికి చేనుకు తీసుకెళ్లాడు. కొంతసేపు తర్వాత వర్షం పడింది. వర్షంతో పాటు పిడుగుపడగా ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

పిడుగుపాటుతో..మేక మృతి

బెజ్జూరు: మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన చిన్నబోయిన బాపుకు చెందిన మేక సోమవారం మేతకు వెళ్లింది. ఈక్రమంలో ఆ ప్రదేశంలో పిడుగుపడడంతో మేక అక్కడికక్కడే మృతిచెందింది. మేక విలువ సుమారు రూ.15వేలు ఉంటుందని కాపరి తెలిపాడు. అధికారులు స్పందించి పరిహారం అందజేయాలని కోరాడు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



హాజీపూర్‌లో కేంద్ర సహాయ మంత్రి సంజయ్‌కు రాఖీ కడుతున్న మహిళలు, కస్తూర్బా విద్యాలయంలో మొక్కలకు రాఖీలు కడుతున్న బాలికలు

దండేపల్లి,ఆగస్టు 19: రాఖీ పౌర్ణమి వేడుకలను సోమవారం ఇంటింటా ఘనంగా జరుపుకున్నారు. సోదరీ సోదరుల అనుబంధానికి అద్దం పట్టేది రక్షా బంధన్. తోబుట్టువులకు రాఖీలు కట్టేందుకు ఆడబిడ్డలు పుట్టింటికి వచ్చి సోదరులకు రాఖీలు కట్టి దీవించగా కానుకలు ఇచ్చి రక్షగా ఉంటానని అభయం ఇస్తారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండే స్వామి ఆలయంలో ఆలయ పురోహితులు భార్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యజ్ఞోపవీత ధారణ వేశారు. అనంతరం సామూహిక యజ్ఞోపవీతధారణ (జంధ్యాలు) వేసుకున్నారు.

కస్తూర్బా విద్యాలయంలో రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా బాలికలతోపాటు ఉపాధ్యాయులు చెట్లు, మొక్కలకు రాఖీలు కట్టారు. మేము మీకు రక్ష..మీరు మాకు రక్ష అంటూ బాలికలు ప్రతిజ్ఞ చేశారు. ప్రత్యేక అధికారి మంజుల ఉపాధ్యాయులు ఉన్నారు.

కోటపల్లి: మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నదమ్ములకు అక్కాచెల్లెల్లు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్‌కు ఆయన సోదరీమణులు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. ఆలయంలో బ్రహ్మణుల ఆధ్వర్యంలో జంధ్యా లు నిర్వహించారు.

జైపూర్: మండ లంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకు న్నారు. అన్నద మ్ములకు అక్కా చెల్లెల్లు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. గ్రామాల్లో ఎటు చూసి అక్కాచెల్లెల్లు అన్నదమ్ముల ఇండ్లకు వెళ్తున్న దృశ్యాలే కనిపించాయి. ముదిగుంట ప్లాంటేషన్‌లో రాఖీ పౌర్ణమి సంబరాలు జరుపుకున్నారు. ప్లాంటేషన్‌లో పనులు చేయడానికి ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన కార్మికులకు ప్లాంటేషన్ వాచర్ శంకర్ కూతురు అరుణ రాఖీలు కట్టారు.



చెన్నూరులో రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్సీకి రాఖీ కడుతున్న సోదరి

మందమర్రి టౌన్: అన్నాచెల్లల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను ఘనంగా జరుపుకు న్నారు. రాఖీ పండుగతో ఆటోలకు గిరాకీ పెరిగింది. జీఎం కార్యాలయంలో మహిళా ఉద్యోగులు జీఎం దేవేందర్‌కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

నస్పూర్: నస్పూర్ పట్టణంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా ప్రజలు జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా చేతికి రాఖీ ఆత్మీయతను, అనురాగాన్ని పంచుకున్నారు. ప్రతి ఇంటా రాఖీ సంబరాలను ఆనందోత్సవాల మధ్య జరిగాయి.

చెన్నూరు: చెన్నూరు పట్టణంతో, మండలంలో రక్షా బంధన్‌ను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉద యమే అక్కాచెల్లెల్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్మన్ అర్చన రాంలాల్‌గిల్డా వైస్‌చైర్మన్ నవాజుద్దీన్‌కు రాఖీ కట్టారు.

మందమర్రిరూరల్: మండలంలో రాఖీ పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణాల్లో ఉన్న సోదరీమణులు గ్రామాలకు చేరుకుని అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. పండగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

హాజీపూర్: మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్నదమ్ములకు అక్కాచెల్లెల్లు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. గ్రామాల్లో ఎటు చూసినా అక్కాచెల్లెల్లు అన్నదమ్ముల ఇండ్లకు వెళ్తున్న దృశ్యాలే కనిపించాయి. మండల కేంద్రంలోని రాఖీల దుకాణాల వద్ద, స్వీటు షాపుల వద్దప్రజలు బారులు తీరి కొనుగోలు చేశారు.

వేమనపల్లి: మండలంలో రాఖీ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణాల్లో ఉన్న సోదరీమణులు గ్రామాలకు చేరుకుని అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. పండగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.


పెంచికలపేటలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క


ఆసిఫాబాద్‌లో..


హైదారాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కుమరం భీం ఆసిఫాబాద్‌లో జిల్లాలో..

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/బెజ్జూరు/పెంచికలపేట/చింతలమానేపల్లి/దహెగాం/జైనూర్/కెరమెరి/సిర్పూర్(టి)/సిర్పూర్(యు), ఆగస్టు 19: అన్నాచెల్లెల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీక అయిన రాఖీపౌర్ణమి వేడుకలను సోమవారం ఆసిఫాబాద్ పట్టణంతోపాటు మండలాల్లో ఘనంగా జరుపు కున్నారు. హైదరాబాద్ పట్టణంలోని తెలంగాణభవన్‌లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కట్టారు. కాగజ్‌నగర్ ఆశోక్‌కాలనీలో ఉంటున్న ముస్లిం వ్యాపారికి హిందూ సోదరీమణులు రాఖీకట్టి సమైఖ్యతను చాటారు. రాఖీలు, స్వీట్లు కొనుగోలు చేసేందుకు మహిళలు షాపుల ముందు బారులు తీరారు. ప్రతిఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. అదేవిధంగా శ్రావణ సోమవారం కావడంతో ఆలయాలుసైతం భక్తులతో కిటకిటలాడాయి. పండుగ నేపథ్యంలో బస్టాండ్, ఆటోస్టాండ్లు మహిళలతో కిలకిటలాడాయి. బస్సులన్నీ రద్దీగా మారాయి. రోడ్లు వచ్చి పోయే వాహనాలతో రద్దీగా మారాయి.


కాగజ్‌నగర్‌లో వ్యాపారి అబ్దుల్ ఉర్‌రహెమాన్‌కు రాఖీకడుతున్న హిందూ సోదరీమణులు


జైనూరులో మాజీ గ్రంథాలయ చైర్మన్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరీ


సిర్పూర్(యు): అన్నలకు రాఖీలు కడుతున్న చెల్లె

అవయవాల అమ్మకం అవాస్తవం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 19: జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన రేవెల్లి శ్రీకాంత్ (35) తీవ్ర గాయాలపాలై బ్రెయిన్ డెడ్ అయి చనిపోగా అవయవాలు అమ్ముకున్నట్లు వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ప్రభుత్వ గుర్తింపు పొందిన జీవన్‌ధాన్ సంస్థ ద్వారా నిబంధనల ప్రకారం అవయవదానం జరిగిందని డీసీపీ ఏ.భాస్కర్ తెలిపారు. సోమవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీకాంత్ జిల్లా కేంద్రంలోని మయూరి ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. ఈ నెల 6న విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా టేకుమట్ల సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టగా తలకు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మయూరి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు, అక్కడి నుండి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 8వ తేదీన శ్రీకాంత్ మృతి చెందాడు ఆసుపత్రిలో జీవన్‌ధాన్ స్కీం అందుబాటులో ఉండగా శ్రీకాంత్ కుటుంబసభ్యులు అవయవ దానం చేశారు. జీవన్‌ధాన్ సంస్థ వారు అంగీకార పత్రాలు తీసుకొని అవయవాలను సేకరించిన అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

అయితే శ్రీకాంత్‌ను చికిత్స నిమిత్తం తరలించే క్రమంలో అంబులెన్స్ డ్రైవర్లు కిరణ్, శ్రావణ్, సాయి, నరేష్, సాగర్‌లు కమీషన్లకు కక్కుర్తి పడి శ్రీకాంత్ కుటుంబీకులను మభ్యపెట్టి వాళ్లకు తెలియని ఆసుపత్రులకు, సంబం ధిత నిపుణులు లేని ఆసుపత్రులకు తీసుకువెళ్లి సరైన సమయంలో వైద్యం అందకుండా చేసినందు న వారిని అరెస్టు చేసినట్లు డీసీపీ తెలిపారు. ఏసీ పీ ఆర్.ప్రకాష్, పట్టణ సీఐ బన్సీలాల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శ్రీనివాస్(ఫైల్)

జన్నారం, ఆగస్టు 19: మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన వంగపల్లి శ్రీనివాస్ (40) ఈ నెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పిం చగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. శ్రీనివాస్ ఇదే గ్రామానికి చెందిన శ్రీపతి ఆనందం వ్యక్తి వద్ద రూ.11 లక్షలు అప్పు తీసుకున్నాడు. రూ.4 లక్షలు తిరిగి ఇవ్వగా అవి వడ్డీ కింద జమ చేసుకున్నానని, మళ్లీ మొత్తం రూ.11 లక్షలు ఇవ్వాలని వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

బైక్ పై నుంచి పడి ఎఫ్‌బీవోకు గాయాలు

జైపూర్, ఆగస్టు 19: భీమారం అటవీ సెక్షన్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.శివకుమార్ సోమవారం బైక్‌పై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాల పాలయ్యడు. ఇందారం చెక్‌పోస్టులో విధులు నిర్వహించిన శివకుమార్ భీమారం బైక్‌పై వెళ్తుండగా జైపూర్ వెలిశాల మల్లన్న గుడి సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలపాయ్యాడు. స్థానికులు మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఎఫ్ఆర్‌వో రత్నాకర్ పరామర్శించారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 19: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పలువురు నాయకులు సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందజేశారు. బీజేపీ జిల్లా నాయకుడు మంత్రి రామయ్య గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఈ అంశం పరిష్కరించాలని కోరారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో పర్మినెంటు భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు వెడల్పు ద్వారా భూములు కోల్పోయిన నిర్వాసితులకు గృహజ్యోతి పథకం ద్వారా లబ్ది చేకూరేలా చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపుల జోరు

● నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు



జైనూర్, ఆగస్టు 19: నిఘా అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా మండలకేంద్రంతోపాటు మారుమూల గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు నెలనెలా ముడుపులు అందజేస్తూ బెల్టుషాపు వ్యాపారులు నియమనిబంధలను తుంగలోకి తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపి స్తున్నారు. అదేవిధంగా బెల్టుషాపులో ఒక్కొక్క బాటిల్‌పై 10 నుంచి 20 రుపాయలు అదనంగా వసులు చేస్తున్నారని మందుబాబులు పేర్కొంటున్నారు.

కూలుతున్న పేదల బతుకులు..

బెల్టుషాపులతో పేదల జీవితాలు కూలిపోతున్నాయి. మందుప్రియులు మద్యానికి బానిసై ఇంట్లోని వస్తువులను అమ్ముకుంటూ, అప్పులపాల వుతూ సర్వం కోల్పోతున్నారు. అదేవిధంగా మరికొందరు అతిగా తాగి అనా రోగ్యంతో కుటుంబ సభ్యులకు దూరమవుతున్నారు. ఫలితంగా ఆ కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడుతున్నాయి.

నీళ్లు కలిపి అదనపు లాభం..

కొంత మంది బెల్టుషాపు వ్యాపారులు ఫుల్ బాటిళ్లలో నీరు కలిపి అధిక లాభాల్ని దండుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 19: పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబును సోమవారం హైదరాబాద్‌లో సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కలిసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ఆయనవెంట స్థానికనాయకులు పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 20 ఆగస్టు 2024

అవయవాల అమ్మకం అవాస్తవం

7లో..

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



జ్వరం... జలుబు.. తలనొప్పి ఇలా ఏదైనా ప్రజలు నేరుగా మెడికల్ షాపు వెళ్లి మందులు కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్, కనీసం ఫార్మసిస్ట్ లేకుండా మెడికల్ షాపు యజమానులు మందులు అందజేస్తున్నారు. యాంటిబయాటిక్స్‌తోపాటు రెండు, మూడు రకాల టాబ్లెట్లు ఇచ్చి ప్రజల అవసరాలను 'క్యాష్' చేసుకుంటున్నారు. మందులు వాడినా జబ్బు నయం కాకపోతే అప్పడు వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రజలు నేరుగా కొనుగోలు చేస్తుండడంతో మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. మెడికల్ షాపు వారు ఇచ్చే మందులతో తాత్కాలికంగా ఉపశమనం పొందుతున్నా దీర్ఘకాలికంగా దుష్పరిణామాలు ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మెడికల్ షాపులలో అడ్డగోలు వ్యాపారం

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు
- కానరాని ఫార్మసిస్టులు.. నిబంధనలకు తూట్లు
- పట్టించుకోని అధికారులు



మంచిర్యాల అర్బన్, ఆగస్టు 19: జిల్లాలో మెడికల్ షాపుల దందా అడ్డగోలుగా సాగుతోంది. సంబంధిత షాపుల నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా ధనార్జనే ధ్యేయంగా తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600లకు పైగా మెడికల్ షాపులు నడుస్తుండగా వాటిల్లో చాలా వరకు నిబంధనలను పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొనుగోలు చేసిన మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వకుండా విక్రయాలు చేపడుతున్నారు. యాంటి బయాటిక్ మందులను డాక్టర్ల సూచనల మేరకు మాత్రమే ఇవ్వాల్సివుంటుంది. కానీ షాపుల నిర్వాహకులు తమ ఇష్టారీతిన వ్యవహరిస్తూ యాంటిబయాటిక్ మందులను ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అనవసరంగా యాంటిబయాటిక్ మందులు వాడిన వారు సైడ్ ఎఫెక్ట్ వల్ల కొత్త రోగాల బారిన పడుతున్నారు.

ఫార్మసిస్టులు లేకుండానే విక్రయాలు

జిల్లాలోని పలు మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులు లేకుండానే విక్రయాలు చేపడుతున్నారు. కనీసం ఫార్మసిస్టు పర్యవేక్షణలోనైనా మందులను ఇవ్వాల్సి వుండగా 10వ తరగతి, ఇంటర్ అర్హత కల్గిన వారితో మందుల విక్రయాలు చేపడుతున్నారు. ఫార్మసీ పూర్తిచేసిన వారి సర్టిఫికెట్లతో షాపుల నిర్వాహకులు తమ దందాను సాగిస్తున్నారు. ఇందుకు సంబంధిత ఫార్మసిస్టులకు యేడాదికి రూ.15వేల నుంచి రూ.20 వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.

మెడికల్ షాపును నిర్వాహించాలంటే

డ్రగ్ అండ్ కాస్మోటిక్ యాక్టు-1940, ఫార్మసీ యాక్టు-1948 ప్రకారంగా బీ ఫార్మసీ లేదా ఎం ఫార్మసీ పూర్తి చేసిన వారు మాత్రమే మెడికల్ షాపుల ను నిర్వహించాల్సి వుంటుంది. షాపు పర్మిషన్ తీసుకునే సందర్భంలో సంబంధిత ఫార్మసిస్టుల సర్టిఫికెట్లతోపాటు వ్యక్తిగత గుర్తింపుకార్డు ప్రతులు, చిరు నామా తదితర వివరాలు దరఖాస్తుతో అనుసంధానం చేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాల్సి వుంటుంది. అనంతరం సంబంధిత అధికారుల నుంచి అనుమతులు మంజూరైన తర్వాతే షాపులను నిర్వాహించాల్సి వుంటుంది.

పట్టించుకోని అధికారులు

షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ క్రయ,విక్రయాలు సాగిస్తున్నారు. ఎలాంటి అర్హతలు లేకుండానే అడ్డదారిన పర్మీష న్లు పొందుతూ తమ దందాను సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ ప్రాథమిక చికిత్స కేంద్రానికి పక్కన వేరే వారి పేరిట మెడికల్ షాపును నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇంత జరుతున్నా సంబంధిత ఔషధ నియంత్రణ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, సంబంధిత షాపుల నిర్వాహకుల నుంచి మామూళ్లు ముడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలకు పాటించని వారి లైసెన్సులు రద్దు చేస్తాం: డ్రగ్ ఇన్ స్పెక్టర్ చందన

జిల్లాలో తరచూ మెడికల్ షాపులను తనిఖీ చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే షాపులకు సంబంధించి రిపోర్టును తయారుచేసి 15 నుంచి 30 రోజుల్లో వివరణ ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తాం. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సంబంధిత షాపుల లైసెన్సులను రద్దు చేస్తాం.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు నెలాఖరులోగా చెల్లించాలి

ఏసీసీ, ఆగస్టు 19 : తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్టోబర్ 2024లో నిర్వహించనున్న పరీక్షలు రాయడానికి ఈ నెల 30వ తేదీలోగా ఫీజు చెల్లించాలని డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అపరాధ రుసుం రూ.25తో సెప్టెంబరు 4 వరకు, రూ. 50తో సెప్టెంబరు 9 వరకు పరీక్ష ఫీజు ఆన్‌లైన్ telanganaopenschool.orgలో, మీసేవలో చెల్లించాలని సూచించారు.

దీక్షను విజయవంతం చేయాలి

ఏసీసీ, ఆగస్టు 19 : మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న హైద్రాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న ఒకరోజు నిరాహార దీక్షను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి 11 సంవత్సరాలు గడిచినా ఇంత వరకు బదిలీలు చేపట్టకపోవడం సరైంది కాదన్నారు. బదిలీలు చేపట్టాలని, ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

దండేపల్లి,ఆగస్టు 19: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ ముందు వరుసలో ఉంటుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగర్స్ రాజేశ్వర్ రావు అన్నారు. లింగాపూర్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులైన వల్లపు జయపాల్‌రెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా, దాసరి రమేష్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలను తక్షణమే చెల్లించాలని, పీఆర్‌సీ ప్రకటించాలన్నారు. డీఈవో, ఎంఈవో పోస్టలను భర్తీ చేయాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు చేపట్టి, 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శు ధరణికోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్, మండల అధ్యక్షకార్యదర్శు ఇప్ప రవి, పానుగంటి లచ్చయ్య, పాల్గొన్నారు.

గూడెంలో పౌర్ణమి రద్దీ



స్వామి వారి వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, ఆగస్టు 19: శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం వేలాది మంది భక్తులు కుటుంబసమేతంగా ఉదయం నుంచి గూడెంకు తరలివచ్చి సత్యదేవున్ని వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

హైకోర్టు జడ్జికి సన్మానం

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 19: లక్షెట్టిపేట పట్టణంలోని ఐబీలో సోమవారం సాయంత్రం హైకోర్టు జడ్జి జస్టిస్ శరత్‌ను జిల్లా జడ్జితోపాటు స్థానిక జడ్జి, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. లక్షెట్టిపేట పట్టణంలో ఒక వివాహ వేడుకలకు హాజరయ్యారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో పోలీసులు గౌరవ వందనం చేసిన అనంతరం జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జిలు సంపత్‌తోపాటు అసదుల్లా షరీఫ్, బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్చాలు, మొక్కలు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, అక్కుల శ్రీధర్, కారుకూరి సురేందర్, నలినికాంత్, పద్మ, పాల్ సుధాకర్, శివశంకర్, ప్రకాశం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మండల వ్యవసాయాధికారి

మందమర్రిరూరల్, ఆగస్టు 19: మందమర్రి మండల వ్యవసాయాధికారిగా గాదర్ల కిరణ్మయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఆమె తాండూర్ నుంచి మందమర్రికి వచ్చారు.

పాఠశాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

హాజీపూర్, ఆగస్టు 19: రాంపూర్ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో నిర్మిస్తున్న పాఠశాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం విద్యాలయంలో భవన నిర్మాణం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ ఎంపీగా పోటీ చేసే సమయంలో ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో ఉన్న దాదాపు అన్ని శిశుమందిర్ పాఠశాలలను సందర్శించానని తెలిపారు. పాఠశాలకు గుండ అమరనాధ్ అనే పూర్వ విద్యార్థి కోటి రూపాయలు విరాళంగా అందించడం గొప్ప విషయమన్నారు. ప్రతీ ఒక్కరు పాఠశాల నిర్మాణానికి విరాళాలు అందించాలన్నారు. సరస్వతి శిశుమందిరాలు పూర్వ విద్యార్థుల కృషి వల్లనే అభివృద్ధి చెందుతున్నాయన్నారు. విద్యారంగంలో కార్పొరేట్ విద్యాసంస్థలు వచ్చిన తర్వాత తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు చదువు, ర్యాంకులపైనే దృష్టి పెడుతున్నాయని, శిశుమందిరాలు దేశం, సమాజం పట్ల విద్యార్థులకు మంచి ఆలోచన ధృక్పదాన్ని అలవాటు చేస్తున్నాయన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా సరస్వతి శిశుమందిరాల్లో ఇంగ్లీష్ మీడియం బోధన ప్రవేశ పెట్టారన్నారు. ఎంపీగా, కేంద్రమంత్రిగా కంటే శిశుమందిర్ విద్యార్థిగానే ఎక్కువ గర్వపడతానని తెలిపారు. దేశం, ధర్మం గురించి ఆలోచన కలిగించే పాఠశాలలు సరస్వతి శిశుమందిరాలు అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో అనిశ్చితి నెలకొనడానికి విద్యార్థులు, ప్రజలకు సమాజం పట్ల సరైన అవగాహన లేకపోవడమేనని తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఏర్పడిన సమస్యలు మన దేశంలో ఏర్పడకముందే హిందువులు జాగృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో విద్యాకమిషన్‌లో నక్సల్ భావజాలం ఉన్న వ్యక్తులు ఉండడం వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా నాశనమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంలో మేధావి వర్గం జాగృతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో మా రాజ్యం వచ్చిందని ఏం చేసినా నడుస్తుందని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, వారికి సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన బుద్ది చెబుతారన్నారు. హనుమాన్ దీక్షా పీఠాధిపతులు విజయవాడకు చెందిన దుర్గప్రసాద్ స్వామి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డీసీ పీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐలు అశోక్, నరేష్ కుమార్, ఎస్‌ఐ సురేష్‌లు బందోబస్తు నిర్వహించారు. రాఖీ పండగ సందర్భంగా మహిళలు బండి సంజయ్‌కు రాఖీలు కట్టారు. విద్యాభారతి దక్షిణ మధ్య సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, ప్రబంధకారిణి అధ్యక్షుడు మాధవరపు వినయ్ ప్రకాష్‌రావు, సరస్వతి విద్యాపీ ఠం అధ్యక్షుడు తిరుపతిరావు, ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రాంత కార్యదర్శి సీతారాములు, విభాగ్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, ప్రధానో పాధ్యాయుడు రామన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.



హాజీపూర్‌లో పాఠశాల అభివృద్ధి పనుల శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి, గూడెంలో పూర్ణకుంభంతో స్వాగతం

వినతుల వెల్లువ

ఎన్‌హెచ్ 63 అలైన్‌మెంట్ మార్చి గ్రీన్‌ఫీల్డ్ హైవే హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల్లోని చేపట్టడం ద్వారా పెద్ద మొత్తంలో రైతులు భూములను కోల్పోతున్నారని బాధితులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతి పత్రం అందించారు. ఇప్పుడున్న ఎన్‌హెచ్ 63 జాతీయ రహదారినే విస్తరించాలని విన్నవించారు. మంచిర్యాలలో మైనింగ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని యుఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తిరుపతి, గెస్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య వినతి పత్రం అందించారు.

వేమనపల్లి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కేంద్రం హోంశాఖ సహాయ యంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ మండల నాయకులు వినతి పత్రం అందించారు. రోడ్లు వేయడానికి అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయించాలని, 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కుందని, రైతులకు భూములను ఇచ్చేలా చూడాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, వెంకటేష్, శ్రీకాంత్, లస్మయ్య, స్వామి పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న బండి సంజయ్

దండేపల్లి: గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పోలీసులు గౌరవ వందనం చేశారు. స్వామి వారి ప్రధానాలయం ఆలయ ఈవో, అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనం అనంతరం సంజయ్‌కి పండితులు ఆశీర్వచనలు, స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శు రాజయ్య, రవిగౌడ్, మాజీ ఎంపీపీ గురువయ్య పాల్గొన్నారు. సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి జిల్లాకు వస్తున్న జిల్లా సరిహద్దు గూడెం వద్ద నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.



వినతిపత్రం అందిస్తున్న ఎన్‌హెచ్ 63 బాధితులు

జిల్లాలో కురిసిన మోస్తరు వర్షం

మందమర్రి టౌన్, ఆగస్టు 19 : మంచిర్యాల జిల్లాలో సోమవారం ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జైపూరులో గరిష్టంగా 56.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా భీమిని మండల కేంద్రంలో 30.5, మందమర్రిలో 29.5, భీమారంలో 25.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మందమర్రి మండల వ్యాప్తంగా సోమవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటలకు పైగా కుండపోత వర్షం పడింది. దీంతో కోల్ బెల్ట్ రోడ్డు జలమయమైంది. స్థానిక పాలవాగు వరదతో ఉప్పొంగింది. చిన్నా చితక కాలువలు వరద నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది. భాగ్యనగర్ కాలనీల్లో నివాసాల మధ్య నీరు చేరింది. 6వ వార్డు ఊరు రామకృష్ణాపూర్‌లో గృహాల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు నివాసాల్లో నిత్యావసర సరుకులు, దుస్తులు తడిసి ముద్దయ్యాయి. పాల చెట్టు నుంచి మొదలు కేకే 5 బంగ్లాస్ వరకు నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాజన్నలవాడ నుంచి రామన్ కాలనీ వరకు నీరు నిలిచింది. కేకే 5 గనికి వెళ్లే రోడ్డు పూర్తిగా జలమయం అయింది.

జైపూర్: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. అరవిందరావు ఇంటి భవనంపై సోమవారం పిడుగు పడి భవనం గోడలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. భారీ శబ్దం రావడంతో కుటుంబీకులు భయాందోళనలకు గురయ్యారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అరవిందరావు పేర్కొన్నారు.

కౌన్సిలర్‌పై చర్యలు చేపట్టాలని రాస్తారోకో

- గంటపాటు నిలిచిన వాహనాలు
- ఆందోళన విరమింపజేసిన డీసీపీ

నస్పూర్, ఆగస్టు 19: కబ్జాలు, మోసాలకు పాల్పడిన నస్పూర్ కౌన్సిలర్ బేర సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు సోమవారం సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. బాధితులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నేతలు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపుల గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా వాహనాల రాకపోకల రద్దీ ఎక్కువ ఉంది. గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆందోళనకారులు బేర సత్యనారాయణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కత్తి డ్రామా ఆడి ఎమ్మెల్యే, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. నస్పూర్‌లో అనేక మందిని ఇబ్బందులకు గురిచేసిన సత్యనారాయణ నీతిసూత్రలు వల్లించడం సిగ్గుచేటన్నారు. భూ కబ్జాలు, బెదిరింపులకు పాల్పడిన అతన్ని పట్టణ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణపై కఠిన చర్యలు చేపట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్‌లు ఆందోళనకారులతో మాట్లాడారు. వెంటనే ఆందోళన విరమించాలని సూచించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుల, నాయకులు డిమాండ్ చేయడంతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీసీపీ చెప్పడంతో రాస్తారోకోను విరమించారు. బాధితులు అంజయ్య, రొడ్డ రాజేశం, సందేల శశికుమార్, జాడి శ్రీనివాస్, చింతల రామానుజం, శివ రామయ్య, చిలువేరు శ్రీనివాస్, చిలువేరు కిరణ్, తిప్పని భీమయ్య, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



బాధితులకు మద్దతుగా బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

స్థానికంగా ఉంటా... సమస్యలు పరిష్కరిస్తా



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు 19: బెల్లంపల్లిలో స్థానికంగా ఉండి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కుటుంబీకులతో కలిసి ప్రారంభించారు. వేద పండితులతో క్యాంపు కార్యాలయంలో పూజలు నిర్వహించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొందరు నాయకులు ఎమ్మెల్యే హైద్రాబాద్‌లో ఉంటున్నాడని అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించింది ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు సూచించారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గానికి వంద కోట్ల నిధులు తీసుకువచ్చానని తెలిపారు. ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి గోదావరి నీరు అందించేందుకు రూ.430 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఇంజనీరింగ్ కళాశాలతోపాటు బస్ డిపో, మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. పట్టణంలో డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చిస్తానన్నారు. ఆరు నెలల్లో బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి రహదారిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సతీమణి గడ్డం రమ, కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి



కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న ప్రజలు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 19: ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా హాజీపూర్, గుల్లపేట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఒక్క చిత్రం మధుర జ్ఞాపకం



ఫొటోగ్రఫీ వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 19: ఒక్క చిత్రం అనేక జ్ఞాపకాలను భద్రపరుస్తుందని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లీ, లయన్స్‌క్లబ్ హైటెక్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. కెమెరా ద్వారా బంధించిన ఒక్క చిత్రం మానవ జీవితంలో ఎన్నో జ్ఞాపకాలను, సంతోషాలను గుర్తు చేస్తాయన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు రాకేష్‌రెడ్డి, విశ్వనాథ్, మధుసూదన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరై కేక్ కట్ చేశారు. నాతరి స్వామి, కుంబాల రాజేష్, వేణు, శంకర్, చక్రధర్, విక్రమ్, సందీప్, రఘు, రాము,మహేందర్ పాల్గొన్నారు. తాండూర్‌లో ఫోటోగ్రాఫర్‌ల సంఘం నాయకులు ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించి కేక్ కట్ చేశారు. చంద్రశేఖర్, సమ్మన్న, శ్రీనివాస్, కృష్ణమూర్తి, సురేష్, సుధాకర్, షారుక్, దుర్గా ప్రసాద్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పట్టణ ప్రొఫెషనల్ ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి సంబరాలను నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు అగ్గు సాగర్, ప్రధాన కార్యదర్శి రమణచారి, కోశాధికారి తాటిపాముల రమేష్ పోటో గ్రాఫర్లు పాల్గొన్నారు.

కోటపల్లి: కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్లు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు పడమటింటి రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.

అచ్చలాపూర్‌లో సామూహిక యజ్ఞోపవీతం



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 19: తాదూర్ మండలంలోని అచ్చలాపూర్‌లో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మహాదేవ వేద పాఠశాలలో సోమవారం సామూహి శ్రావణి కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం నిర్వహించారు. అనంతరం హోమ కార్యక్రమం నిర్వహించి యజ్ఞోపవీతాలను మార్చుకున్నారు. వేద పండితులు దుద్దుళ్ల మనోహర శర్మ, అప్పాల శ్యాంప్రణీత్ శర్మ, ఆధ్వర్యంలో నిర్వహించారు. ముద్దు అవదూత, అశోక్, గోవింద్, అప్పాల నరహరి శర్మ, గట్టు పహ్లాద్, రజేశ్వర్ పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

జన్నారం, ఆగస్టు 19 : మండలంలోని ధర్మారం గ్రామంలో నిరుపేద కుటుంబమైన గుమ్ముల జమున వివాహానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, ఇసాక్, శంకరయ్య, ముజాఫర్, రాజేష్, లక్ష్మీనారాయణ, దుర్గమ్మ , గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.